క్లుప్తంగా

పోషకాహారం తీసుకోవాలి



సీమంతం నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ఖానాపూర్: గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల అన్నారు. పోషణమాసంలో భాగంగా బుధవారం పట్టణంలోని బర్కత్‌పుర, శివాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు వరలక్ష్మి, విజయ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరా బంద్

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ ఏరియా, ఏఎంకే ఫంక్షన్‌హాల్ ప్రాంతంలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటులో భాగంగా ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. టవర్స్ కాలనీ, ఏఎంకే ఫంక్షన్‌హాల్, బస్టాండ్ ఏరియాలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కేజీబీవీలో వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రమేశ్

సోన్: బాలశక్తిలో భాగంగా బుధవారం సోన్ కేజీబీవీలో 275 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయుష్ వైద్యాధికారి రమేశ్, ఎస్‌ఓ లతాదేవి తెలిపారు. రక్తహీనత, థైరాయిడ్, పోషకాహార లోపం, ఊబకాయం, విటమిన్ లోపం వంటి వ్యాధుల పరీక్షలు చేసి మందులు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ సుచరిత, ఏఎన్‌ఎం అనిత, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలి

భైంసాటౌన్: పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ జానకీ షర్మిల ఆదేశించారు. బుధవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పరిష్కరించాలని ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు. భరోసా కేంద్రంలోని 'షీ టీం' సిబ్బంది పనితీరు అభినందనీయమని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

21వరకు బాసర్ బీట్ బంద్

భైంసాటౌన్:పట్టణంలోని మార్కెట్ యార్డులో ఈనెల 16 నుంచి 21 వరకు పంట ఉత్పత్తుల కొనుగోళ్లు నిలిపివేయనున్నట్లు ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పూర్యానాయక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీపావళి పండుగ నేపథ్యంలో కమీషన్ ఏజెంట్ల విన్నపం మేరకు ఆరు రోజుల పాటు బాసర్ బీట్ బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 22 నుంచి యథావిధిగా కొనుగోళ్లు సాగుతాయని.. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుడి పోస్టు భర్తీకి వినతి

కుభీర్: మండలకేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు పోస్టు ఖాళీగా ఉందని.. భర్తీ చేయాలని మైనార్టీ నాయకులు బుధవారం ఎంఈవో రాజులదేవి విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొనగా సమస్య పరిష్కరిస్తామని ఎంఈవో చెప్పినట్లు నాయకులు పేర్కొన్నారు.

పాఠశాలలో నమూనా ఎన్నికలు

నిర్మల్‌రూరల్: మండలంలోని రత్నాపూర్ కాండ్లీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. హెడ్‌బాయ్‌గా సీహెచ్.అరుణ్, అసిస్టెంట్ హెడ్‌బాయ్‌గా జశ్వంత్, హెడ్‌గర్ల్‌గా జి.లక్ష్మి, అసిస్టెంట్ హెడ్‌గర్ల్‌గా కె. ప్రగతి గెలుపొందారు. అంతకముందు ఉపాధ్యాయులు ఎన్నికల విధానం వివరించారు. హెచ్‌ఎం విజయస్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెట్టెలు పంపిణీ

కుభీర్: మండలంలోని దొడర్నా ఆశ్రమ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు బుధవారం జీఎస్టీ, అండ్ కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ వారు సమకూర్చిన ఇనుప పెట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, కస్టమ్స్ అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిర్లక్ష్యంగా పడేశారు..



లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామంలో ప్యాడీ క్లీనర్‌ను పాఠశాల ఆవరణలో నిర్లక్ష్యంగా పడేశారు. యాసంగిలో స్థానిక పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పంట కొనుగోళ్లు పూర్తయిన తర్వాత యంత్రం భద్రపర్చకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పుపడుతోంది.

పంట వ్యర్థాలతో ఇబ్బందులు



లక్ష్మణచాంద: మండలకేంద్రం నుంచి ధర్మారం వెళ్లే మార్గంలో సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై పంటవ్యర్థాలతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సోయా పంటను నూర్పిడి చేసిన రైతులు వ్యర్థాలను రోడ్డుపైనే వదిలేశారు. వ్యర్థాలను తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన ఆర్టీసీ సేవలు

- భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- రాకపోకలకు ప్రజల అవస్థలు
- బస్సులు నిలిపివేయడంతో కాలినడకన వెళ్తున్న విద్యార్థులు
- అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ వాహనదారులు

తానూరు: ఇటీవల కురిసిన భారీవర్షాలకు రోడ్లు దెబ్బతినగా.. ఆర్టీసీ అధికారులు తానూరు మండలంలోని కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం నిలిపివేశారు. దీంతో రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిని అవకాశంగా మల్చుకుంటున్న ప్రైవేటు వాహనదారులు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించి.. ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభమయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై కథనం.



బస్సులేక బోల్సా నుంచి బోరిగాం పాఠశాలకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

కర్కెల్లికి నిలిచిన బస్సు..

గత నెలలో భారీ వర్షానికి తానూరు మండలంలోని బెల్‌తరోడా సట్వాజీ వాగు వద్ద వరదలకు ఇరువైపులా రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో భైంసా నుంచి తానూరు మీదుగా మహారాష్ట్రలోని కర్కెల్లి గ్రామానికి రాకపోకలు సాగించే బస్సును ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. దీంతో మండలంలోని బెల్‌తరోడా, బోల్సా, బెంబర, బోరిగాం, తానూరు, హిప్నెల్లి, జౌలా(కే), వడ్‌గాం, కల్యాణి, కుప్టితోపాటు మహారాష్ట్రలోని కర్కెల్లి గ్రామాల ప్రజలు, విద్యార్థులకు రవాణా కష్టాలు తప్పడం లేదు.

బస్సు నడపకపోవడంతో భైంసా, ముధోల్ ప్రాంతాలకు వెళ్లే ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.



బెల్‌తరోడాలో సట్వాజీ వాగు వద్ద కోతకు గురైన డబుల్ రోడ్డు

ఉమ్రికి నిలిచిన బస్సు..

మండలంలోని మొగ్లి గ్రామ సమీపంలో వంతెన వద్ద రోడ్డు కోతకు గురవడంతో భైంసా నుంచి ముధోల్, తానూరు మీదుగా మహారాష్ట్రలోని ఉమ్రి పట్టణానికి వెళ్లే బస్సును ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. దీంతో సింగన్‌గాం, తానూరు, కోలూరు, మస్తల్గాతండా, మొగ్లి గ్రామాల విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

అధిక చార్జీలు వసూలు..

ఆర్టీసీ అధికారులు బస్సులు నిలిపేయడంతో ప్రైవేటు వాహనదారులు ప్రయాణికుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారు. ఆటోడ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. అధిక చార్జీలు, నడక కారణంగా పలువురు విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లడం లేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి ఆర్టీసీ బస్సు సేవలను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



బెల్‌తరోడా సట్వాజీ వాగు వంతెన సమీపంలో రోడ్డు కోతకు గురవడంతో అధికారులు బస్సు నిలిపివేశారు. దీంతో విద్యార్థులు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టి బస్సు సౌకర్యం కల్పించాలి .

– సుదర్శన్, బోల్సా

మరమ్మతులు చేపడుతాం

తానూరు మండలంలో భారీవర్షాలకు దెబ్బతిన్న రోడ్లు పరిశీలించాం. మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయి. సత్వరం పనులు చేపట్టి ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం.

– సునీల్, ఆర్అండ్‌బీ డీఈ

జీవాలకు టీకాలు వేయించాలి



నర్సాపూర్(జి): టీకా వేస్తున్న వైద్యుడు



కడెం: టీకా వేస్తున్న పశువైద్యాధికారి సౌందర్య

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పశుపోషకులు జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ ఖానాపూర్ ఏడీ రామచంద్రుడు, ఖానాపూర్ మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి అధికారి సౌందర్య అన్నారు. బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. జాతీయ పశువ్యాధుల నివారణ టీకా కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి నవంబర్ 14వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని గ్రామంలో బుధవారం పశువులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి షేక్ ముక్తార్ అహ్మద్ తెలిపారు. సిబ్బంది ప్రవీణ్ ,శేఖర్, రైతులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని పశువైద్యాధికారి సంధ్యారాణి ప్రారంభించారు. వెటర్నరీ అసిస్టెంట్ దేవిదాస్, సిబ్బంది మధు, మనోజ్ తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని పెద్దూరు గ్రామంలో గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి సౌందర్య ప్రారంభించారు. పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

చాకిరేవుకు సోలార్ విద్యుత్ పునరుద్ధరణ

- కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

పెంబి: మండలంలోని దోందారి పంచాయతీ పరిధి చాకిరేవు గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేక చీకట్లోనే జీవనం సాగించేవారు. గతేడాది ఆహా యాజమాన్యం(హైదరాబాద్) సోలార్ ప్లాంట్ ద్వారా వీధిలోని ప్రతి ఇంటి వద్ద ఒక బల్బు వెలిగేలా ఏర్పాట్లు చేశారు. కానీ సదరు బ్యాటరీలు, ఇన్వర్టర్ దెబ్బతినడంతో రెండు నెలలుగా మళ్లీ గ్రామంలో అంధకారం నెలకొంది. ఈ సమస్యను దోందారి గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్‌కు విన్నవించగా ఆయన కలెక్టర్ అభిలాష అభినవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ రూ.1,21,300 మంజూరు చేయగా బుధవారం బ్యాటరీలు, ఇన్వర్టర్‌ను ప్రత్యేక వాహనంలో గ్రామానికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు చాకిరేవు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం కన్వీనర్ కుడిమేత విజయ్, గ్రామ కమిటీ సభ్యులు వసంత్, శంభు, మాణిక్ రావు, జంగు బాపు, భీము తదితరులు ఉన్నారు.



బ్యాటరీలు దించుతున్న గ్రామస్తులు

న్యూకంజర్‌లో దొంగల బీభత్సం

- ఆలయాల్లోకి చొరబడి ప్రతిమలను బయట పడేసిన వైనం
- వివరాలు సేకరించిన పోలీసులు



ఆలయ సమీపంలో మహాలక్ష్మీ ప్రతిమ



వివరాలు తెలుసుకుంటున్న సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని న్యూకంజర్ గ్రామంలో బుధవారం మహాలక్ష్మీ, ముత్యాలమ్మ ఆలయాల్లో దొంగలు పడి అమ్మవారి విగ్రహాలను బయట పడేసిన ఘటన చోటు చేసుకొంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. న్యూకంజర్‌లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ దేవతలైన మహాలక్ష్మీ, ముత్యాలమ్మ ఆలయాల తాళాలు పగులగొట్టారు. మహాలక్ష్మీ, ముత్యాలమ్మ విగ్రహాలను తీసుకొచ్చి సమీపంలో బురదలో పాడేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు ఆలయ పూజారి బండారి నడిపి సాయన్న గమనించి గ్రామస్తులకు సమాచారమిచ్చాడు. గ్రామస్తులు ఆలయం వద్దకు వెళ్లి చూడగా రెండు గ్రాముల అమ్మవారి వెండి కండ్లు, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ దేవతల విగ్రహాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వారంతా కలిసి పరిసరాలలో వెతకగా సమీపంలోని బురదలో అమ్మవారి విగ్రహాలు పడేసి ఉన్నాయి. సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్ ఆలయం వద్దకు చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. విగ్రహాలను తీసుకొచ్చి భద్రపరచారు. సాయన్న ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

తానూరు ఉపాధ్యాయుడికి అవార్డు

తానూరు: మండలకేంద్రంలోని వివేకానంద పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేసే డి.నర్సింగ్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. బుధవారం అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని డీఆర్‌డీవో సతీశ్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో లీడ్ ఇండియా చైర్మన్ సుదర్శన్ ఆచార్య తదితరులున్నారు. ఆయనను పాఠశాల యాజమాన్యం, సిబ్బంది అభినందించారు.

వకీల్‌నగర్‌లో బురద కష్టాలు



కడెం: మండలంలోని కన్నాపూర్ పంచాయతీ పరిధిలోని వకీల్‌నగర్ గ్రామానికి బీటీరోడ్డు కరువైంది. దీంతో ఏళ్లుగా గ్రామస్తులను బురద రోడ్డు కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కలాం స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలి



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు



భైంసారూరల్: చుచుంద్ పాఠశాలలో..

నిర్మల్‌టౌన్: భారతదేశ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని అబ్దుల్ కలాం ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ అజాహరుద్దీన్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఈద్గాం చౌరస్తా వద్ద అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈద్గాం చౌరస్తా వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో కలాం విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మహమ్మద్ అబ్దుల్ షేక్, ఖలీల్ ,రయిస్, రహీం, అసద్, తాజీమ్, తన్వర్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మహమ్మద్ సలీం, అన్వర్, వహీద్, సమీర్, ఆరీఫ్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేశ్, ఉపాధ్యాయులు పండరి, జి.రాజేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు, కుంటాల, ఓలా, లింబా(కె), అంబకంటి గ్రామాల్లోని పాఠశాలల్లో బుధవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఎంఈవో ముత్యం , ప్రిన్సిపాల్ గంగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని రవీంద్ర ఉన్నత పాఠశాలలో బుధవారం ఏపీజే అబుల్ కలాం జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, చైర్మన్ భీమ్‌రావు దేశాయ్, పోతన్నయాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేర్కపల్లెలో..

దస్తురాబాద్: మండలంలోని పేర్కపల్లె ప్రాథమిక పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఎంఈవో గంగాధర్, హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయురాలు రాధిక, సీఆర్పీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జామ్ పాఠశాలకు విరాళం



బ్యాగులు అందుకున్న విద్యార్థులతో క్లబ్ ప్రతినిధులు

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ద్వారా రూ.లక్ష విలువైన ఆటవస్తువులు, బ్యాగులు, మైక్‌సెట్ తదితర సామగ్రిని బుధవారం అందించారు. జామ్ గ్రామానికి చెందిన ఏలేటి నర్సింహారెడ్డి కుమార్తె ఏలేటి లావణ్య–దేవేందర్‌రెడ్డి తమ తండ్రి జ్ఞాపకార్థం రూ.లక్ష విలువైన వస్తువులను సమకూర్చి రోటరీ క్లబ్ ప్రతినిధులకు అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విలాస్, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు జనార్దన్, నర్సయ్య, రోటరీ క్లబ్ ప్రతినిధులు యోగేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మత్తుపదార్థాలకు దూరముండాలి

లోకేశ్వరం: యువత మత్తు పదార్థాలకు దూరం ఉండి పట్టుదలతో ఉన్నత చదువులు చదవాలని నిర్మల్ ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని పుస్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలతో కలిగే సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం చంద్రప్రకాశ్‌గౌడ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, నాగన్న తదితరులు ఉన్నారు.

నష్టపరిహారం విడుదల చేయాలి

భైంసాటౌన్: ఇటీవల భారీవర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని భారత కిసాన్ సంఘ్ నేతలు అన్నారు. ఈ మేరకు సోయా పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, రైతులకు పంట నష్టపరిహారం అందించాలనే డిమాండ్‌తో బాసర నుంచి పాదయాత్ర చేపట్టారు. బుధవారం భైంసాకు చేరుకుని సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన సబ్ కలెక్టర్ పంట నష్టంపై క్షేత్రస్థాయిలో నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. వారంరోజుల్లో సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇళ్ల పనులు పూర్తిచేయండి

సోన్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎంపీవో మహేందర్ పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, లబ్ధిదారులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని రాజురాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో రమాకాంత్ పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఏఎంసీ డైరెక్టర్ నారాయణరెడ్డి, నాయకులు చిన్నం రవీందర్, నిమ్యానాయక్, ఫరీద్, కార్యదర్శి రాణి తదితరులు ఉన్నారు.



సోన్‌లో పనులు పరిశీలిస్తున్న ఎంపీఓ మహేందర్

ఆర్‌ఎంవోకు సన్మానం

నిర్మల్‌టౌన్: ఇటీవల పదోన్నతిపై నిర్మల్ జనరల్ ఆసుపత్రికి ఆర్‌ఎంవోగా వచ్చిన డాక్టర్ చింతపండు రవికుమార్‌ను బుధవారం జిల్లాకేంద్రంలో ఫిజీషియన్ల సంఘం సభ్యులు సన్మానించారు. దామెర రాములు, జిల్లా ఫిజీషియన్ల సంఘం అధ్యక్షుడు ముకేశ్, రవికుమార్, రనీత్‌కుమార్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ముధోల్: రైతులకు ఇబ్బంది లేకుండా సోయా కొనుగోలు కేంద్రాన్ని ముధోల్‌లో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు బీజేపీ ముధోల్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నరేశ్ దర్బార్ వినతిపత్రం అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మద్దతు ధర రూ.5300 అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నరేశ్ తెలిపారు.



ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు వినతిపత్రం అందిస్తున్న నరేశ్